హరితహారం మొక్కలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

నేడు రక్షణ లేక మంటల్లో కాలి బూడిదైపోతున్న హరితహారం చెట్లు

నాడు కళ కళ.. నేడు వెల వెల..

- హరితహారం మొక్కలకు రక్షణేది?
- అధికారులు.. జర నిద్రలేవండి..
- గ్రామీణ రోడ్లపై మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోరా..
- మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలంటున్న గ్రామీణులు

అధికారులు మొద్దు నిద్రలో ఉండడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. నాడు ప్రతిష్ఠాత్మకంగా నాటిన మొక్కలను అధికారులు గాలికి వదిలేయడంతో నేడు అవి ఎండిపోయాయి.

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 : బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నది. రాష్ట్రంలో తగ్గిపోతున్న అడవుల శాతాన్ని పెంచేందుకు కృషి చేసింది. మొక్కలను పెంచితే వర్షాలు సమృద్ధిగా కురిసి.. ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ఉన్నత ఆశయంతో హరితహారం చేపట్టారు. ఈ కార్యక్రమం ఎనిమిది విడుతలుగా విజయవంతంగా కొనసాగింది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు ఎంతో ఏపుగా పెరిగాయి. ఈ మొక్కలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదాన్ని పెంచే స్థాయికి చేరుకున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలను చూస్తే ఎంతో ఆహ్లాదకరంగా కనిపించేవి. ప్రతిరోజు గ్రామ పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా నీటిని అందించారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. మూగజీవాలు మేయకుండా రక్షణ కవచాలు ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులు నిద్రమత్తులో వాటిని పట్టించుకోవడం లేదు. నిత్యం ఈ రోడ్లపై అధికారులు విధులకు వెళ్తుంటారు. కానీ.. వారికి రోడ్డు పక్కన ఎండిపోతున్న హరితహారం మొక్కలు కనిపించడం లేదని గ్రామీణులు మండిపడుతున్నారు. హరితహారంపై ప్రభుత్వం, కింది స్థాయి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటిన హరితహారం మొక్కలకు పూర్తిగా రక్షణ కరువైంది. అగ్ని ప్రమాదాలతో కాలిపోవడం, మూగజీవాలు మేయడం, నీరు సరిగ్గా అందకపోవడంతో హరితహారం మొక్కలు పూర్తిగా ఎండిపోతున్నాయని, వీటిని పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామీణ ప్రాంత ప్రజలు తెలుపుతున్నారు. మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మీ సేవలు అభినందనీయం

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో వడ్ల నందు ఫౌండేషన్ చైర్మన్ వడ్లనందు దంపతులు

ధారూరు, ఫిబ్రవరి 21 : కరోనా సమయంలో వడ్ల నందు ఫౌండేషన్ ద్వారా చేసిన సేవలు అభినందనీయమని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వడ్ల నందు దంపతులను శుక్రవారం ఆయన రాజభవన్‌లో అభినందించారు. కరోనా సమయంలో ఫౌండేషన్ ద్వారా ప్రతీ గ్రామానికి శానిటేషన్ అందించి ఎన్నో సామజిక సేవా కార్యక్రమాలు చేశారు. ఎన్నో విధాలుగా సేవలు చేసినందుకు రాజ్‌భవన్ నుంచి విందుకు పిలుపునిచ్చారు. వారి వెంట పలువురు సభ్యులు ఉన్నారు.

రేపు గురుకులాల్లో ప్రవేశానికి పరీక్ష

మొయినాబాద్, ఫిబ్రవరి 21 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికలు, బాలుర పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి, శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం నిర్వహించే రాత పరీక్ష ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 9.30 గంటల వరకు చేరుకోవాలని సూచించారు. ప్రవేశాల కోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసేందుకు రావాలన్నారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే సమయంలో హాల్ టికెట్, ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ తీసుకు రావాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకు రాకూడదని తెలిపారు. చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులు మొయినాబాద్‌లోని తోలుకట్టా గ్రామ గేట్ వద్ద బస్సు దిగి ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ చెప్పారు. శంకర్‌పల్లి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం వద్ద (మొయినాబాద్ పోలీస్ స్టేషన్) బస్సు దిగి రావాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. జిల్లాలోని 1,79,218 మంది విద్యార్థులకు 244 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వారిలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 85,753 మంది. కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 93,465 మంది ఉన్నారని చెప్పారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు ట్రాఫిక్ దృష్ట్యా విద్యార్థులు ఉదయం 8 గంటల వరకే కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా నిర్వహించాలని, ప్రశ్నాపత్రాల తరలింపులో పోలీసులు అత్యంత బాధ్యత, భద్రత పాటించాలని ఆదేశించారు. విద్యార్థులు సమయానుకూలంగా పరీక్షా కేంద్రాలకు చేరేలా ఆర్టీసీ బస్సులు నడపాలని, నిరంతరం పరీక్షా కేంద్రాల్లో విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని, తాగునీరు, శానిటేషన్‌తో పాటు అన్ని పరీక్షా కేంద్రాల్లో వైద్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనల మేరకు నిర్దేశించిన సమయానికి అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నం. 040 29700934లో సంప్రదించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి డి.ఒడ్డెన్న, ఏసీపీ భాస్కర్, ఆర్ఎం బాబూ నాయక్, జిల్లా వైద్య అధికారి జె.వెంకటి, పోస్టల్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నానికి వంట సరుకులు పంపిణీ చేయాలి

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వినతి

హిమాయత్ నగర్, ఫిబ్రవరి21: మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని శుక్రవారం ఎల్బీస్టేడియంలోని ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో తెలంగాణ విద్యా శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు పి. ప్రేమ పావని మాట్లాడుతూ.. మార్కెట్లో పెరిగిన ధరలతో కోడిగుడ్లు నిత్యావసర వస్తువులు, కొనుగోలు చేయలేక మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులకు అనేక ఇబ్బందులు పడటంతో పాటు వారికి అదనంగా ఆర్థికభారం పడుతుందని తెలిపారు. నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లు, వంట గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వంట కార్మికులు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10 వేల వేతనంతో పాటు బకాయి ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరారు. చైర్మన్ ఆకునూరి మురళి సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు ఎ. కమలా రెడ్డి, ఉపాధ్య క్షులు టి.చక్రపాణి, ఎం. లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పక్కదారి

దర్యాప్తు చేపడుతున్న అధికారులు

Telangana State Civil Supplies Corporation ltd., Rangareddy District
TRUCK CHIT

76 బస్తాలు పొందుపరిచిన ట్రక్కు షీట్

Telangana State Civil Supplies Corporation ltd., Rangareddy District
TRUCK CHIT

68 బస్తాలు పొందుపరిచిన ట్రక్కు షీట్

ఆమనగల్లు, ఫిబ్రవరి 21 : పేద ప్రజల ఆహార భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నది. పేదల ఆహారం కోసం అందించే రేషన్ బియ్యం అక్రమార్కులకు వ్యాపార వస్తువుగా మారి కాసులు కురిపిస్తున్నది. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో అధికారుల అండదండలతో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతున్నది. ఆమనగల్లులోని సివిల్ సప్లై గోదాం నుంచి ఈ నెల 18న ఒక ట్రక్కు షీట్‌లో 37.89 క్వింటాళ్లు (76బస్తాలు), రెండో ట్రక్కు షీట్‌లో 34 క్వింటాళ్లు (68 బస్తాలు), మొత్తం 73.89 క్వింటాళ్ల బియ్యాన్ని డీసీఎంలో తలకొండపల్లి మండల పరిధిలోని వెల్‌జాల్‌లో ఉన్న ఒకటో నంబర్ రేషన్ దుకాణానికి తరలించారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో బుధవారం ఆమనగల్లులోని పీడీఎస్ బియ్యం గోదాంలో, వెల్‌జాల్‌లోని రేషన్ దుకాణంలో సివిల్ సప్లై ఏఎస్‌పీ గోపాలకృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ భాను తనిఖీలు నిర్వహించారు. ఈ విషయమై ఫోన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ భానుతో మాట్లాడగా వెల్‌జాల్‌లోని ఒకటో నంబర్ రేషన్ దుకాణంలో 69 బస్తాలు గుర్తించామని, అంత సరిగ్గానే ఉందన్నారు. మిగితా 68 బస్తాలు (34 క్వింటాళ్లు) బియ్యం ఎటుపోయాయని డీటీ భానును అడుగగా గురువారం మరోసారి సోదాలు చేసి పూర్తి సమాచారం ఇస్తామన్నారు. గురువారం మరోమారు డీటీ భానుతో మాట్లాడగా రేషన్‌బియ్యం దర్యాప్తు చేస్తున్నామని, శుక్రవారం ఆమనగల్లుకు వచ్చి పూర్తి వివరాలు ఇస్తామన్నారు. శుక్కవారం మరోమారు అడుగగా శనివారం ఇస్తామంటున్నారు. ఈ దాటవేతపై అంతర్యం ఏముంటుందని ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై గోదాం నుంచి రేషన్ బియ్యం చౌకధర దుకాణాలను పంపినప్పుడు ఎన్ని బస్తాలు, ఎన్ని క్వింటాళ్ల బియ్యం అనే వివరాలు ట్రక్కు షీట్‌లో పొందుపరిచి గోదాం ఇన్‌చార్జి (డిప్యూటీ తహసీల్దార్) సంతకం ఉండాలి. ఈ ట్రక్కు షీట్‌లలో కేవలం గోదాం స్టాంపు మాత్రమే ముద్రించారు. ఇన్ని అనుమానాలు తలెత్తుతున్న ఈ బియ్యంపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి నిజానిజాలు బయటకు తీయాలని ప్రజలు కోరుతున్నారు.

స్థాయి సంఘం ఏకగ్రీవం!

ఎంఐఎం-8, కాంగ్రెస్-7... 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ప్రకటన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయింది. బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయం మేరకు ఆ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఎన్నిక లేకుండా ఏకగ్రీవంతో ముగిసింది. ఏడాది కాల పరిమితితో మొత్తం 15 సభ్యుల ఎన్నికకు గాను మొత్తం 17 మంది నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. ఎంఐఎం పార్టీ నుంచి 8 మంది, కాంగ్రెస్ పార్టీ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు వేయగా, పరిశీలనలో అన్ని ఓకే అయ్యాయి. ఈ మేరకు షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 21 (శుక్రవారం) మధ్యాహ్నం 3 గంటల లోపు ఉపసంహరణ అవకాశం ఉండటంతో గురువారం బీఆర్ఎస్ పార్టీ నుంచి నామినేషన్ వేసిన ప్రసన్న లక్ష్మి , చివరి రోజు కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు కమిషనర్ ఇలంబర్తి ప్రకటించారు.

ఏడాది కాల పరిమితి

స్టాండింగ్ కమిటీ సభ్యులుగా వీరి పదవీ కాలం ఒక ఏడాది పాటు ఉంటుంది. జీహెచ్ఎంసీలో రూ. రెండు కోట్ల నుంచి రూ. 3 కోట్ల మేర విలువైన పనులకు స్టాండింగ్ కమిటీ వారానికోసారి సమావేశం అవుతుంది. అందుకు వారంలో ఏదో ఒక రోజును ఎంపిక చేసుకోవడం అనవాయితి. గత పాలక మండలిలో ప్రతి గురువారం నిర్వహిస్తూ వచ్చారు.

ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యులు

ఎంఐఎం నుంచి గౌస్ ఉద్దీన్ మహ్మద్, డాక్టర్ ఆయేషా హుమేర, సమీనా బేగం, పర్వీన్ సుల్తానా, మహ్మద్ సలీం, అబ్దుల్ వాహెద్, సయ్యద్ మినహాజుద్దీన్, బాత జబీన్ లు, కాంగ్రెస్ నుంచి మహాలక్ష్మి రామన్ గౌడ్, బురుగడ్డ పుష్ప, సీఎన్ రెడ్డి, వి. జగదీశ్వర్ గౌడ్, బానోతు సుజాత, బొంతు శ్రీదేవి, బాబా ఫసియుద్దీన్ లు ఉన్నారు.

స్టాండింగ్ కమిటీలో బలంగా ఎంఐఎం

వారిది ఒక్కటే ఎజెండా. అధికార పార్టీ ఏది ఉంటే ఆ పార్టీతో మంట కాగడం పతంగి పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. గతంలో బీఆర్ఎస్‌తో జత కట్టిన ఎంఐఎం పార్టీ ఈ సారి కాంగ్రెస్‌కు అండగా నిలబడింది. పరస్పర అవగాహన ఒప్పందంలో భాగంగానే ఎంఐఎం పార్టీ స్టాండింగ్ కమిటీలో 8 మందితో నామినేషన్లు వేసి తమ ఆధిక్యతను ప్రదర్శించుకున్నది. బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం పార్టీతో కలిసి 7 గురు సభ్యులతో స్టాండింగ్ కమిటీలో చోటు కల్పించుకున్నది. ఎన్నికల ఏడాది కావడంతో వ్యూహాత్మకంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రభుత్వ విధానపరమైన లోపాలను ఎండగట్టడమే లక్ష్యంగా పనిచేసేలా కార్యాచరణను రూపొందించుకున్నది. కాగా, స్టాండింగ్ కమిటీలో రెండు పార్టీలకు సంబంధించి ఒక్కో పార్టీ నుంచి నలుగురు మహిళా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉండటం గమనార్హం.

చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలి

- ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలి
- మార్చ్ 12, 13 తేదీల్లో చలో ఢిల్లీ
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, డా. ఎన్.మారేశ్ తదితరులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 21: దేశ వ్యాప్తంగా 60 శాతం ఉన్న ఓబీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి 2 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓబీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, గురుకుల పాఠశాలలు, రెసిడెన్సీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య విచ్చేయగా, సభకు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేశ్ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం మార్చి 12, 13 తేదీలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏపీ భవన్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఓబీసీ డిమాండ్లపై మేధావుల సదస్సును నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు హాజరవుతున్నారని కృష్ణయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున 100 పైగా కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, ఉద్యోగ సంఘాలు హాజరు కాబోతున్నాయని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు దాటినా ఓబీసీలకు మాత్రం రాజకీయ స్వాతంత్ర్యం రాలేదని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు సాధించడంతోనే ఓబీసీలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరగవలసిన చారిత్రాత్మక అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా నేడు ఓబీసీలపై దృష్టి సారించిందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీల పక్షపాతి అని, మోదీతోనే ఓబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. నేడు ఉద్యమం పతాక స్థాయికి చేరుకున్నదని, ఈ దశలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. మార్చి 12,13వ తేదీల్లో చలో ఢిల్లీ బీసీ మేధావుల సదస్సును పెద్ద ఎత్తున ఓబీసీలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఎన్.మారేశ్ మాట్లాడుతూ బీసీల ఆరాధ్య దైవం అయిన ఆర్.కృష్ణయ్య, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లపై చర్చించి ఒప్పించి రాజకీయ రిజర్వేషన్లు సాధించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. అన్ని పార్టీలు బీసీల రిజర్వేషన్లపైనే దృష్టి సారించాయని తెలిపారు. అనంతరం, మార్చి 12,13వ తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్ర ఓబీసీ సమాఖ్య అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాస్, నీరడి భూపేష్ సాగర్, సి.రాజేందర్, పితాని ప్రసాద్, నడిపిన శ్రీనివాసరావు, నీలం వెంకటేశ్, రాజశేఖర్, అనంతయ్య, చల్లా వరుణ్, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ వన్ టైం పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ వన్ టైం పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

బీఈడీ, ఎంఈడీ వన్ టైం చాన్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఈడీ, ఎంఈడీ కోర్సుల వన్ టైం పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఇయర్ వైజ్), బీఈడీ (సెమిస్టర్ వైజ్), ఎంఈడీ (సెమిస్టర్ వైజ్) వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల ఆరవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: వివిధ సైకాలజీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ, ఎంఫిల్ ఇన్ రిహబిలిటేషన్ సైకాలజీ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, పీఎస్వై క్లినికల్ సైకాలజీ మొదటి సంవత్సరం రెగ్యులర్, ప్రొఫెషనల్ డిప్లమా ఇన్ క్లినికల్ సైకాలజీ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 7వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 12వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac. inలో చూసుకోవాలని సూచించారు.

తల్లిదండ్రులకు పాదపూజ

హయత్‌నగర్, ఫిబ్రవరి 21 : సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నామని శ్రీచైతన్య స్కూల్ దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎం సతీశ్ అన్నారు. శుక్రవారం హయత్‌నగర్ బ్రాంచి(సాయినగర్) శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఆర్ఐ వెంకట్‌రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ రఘువంశీ, డీన్ రఘుపతి, సీబ్యాచ్ ఇన్‌చార్జి సోమయ్య, ఏవో ప్రమోద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్ సిటీ.. పీచే ముడ్!

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): హెచ్ సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు ఆ మూడు శాఖల్లో మంట పుట్టిస్తున్నది. ఎస్సార్‌డీపీ స్థానంలో సిగ్నల్లు లేని జంక్షన్లే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి హెచ్ సిటీ ప్రాజెక్టును తీసుకువచ్చి రూ.2,373 కోట్ల పనులకు టెండర్లు పిలవాలని సర్కారు జీహెచ్ఎంసీని ఆదేశించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అన్ని చోట్ల పనులకు టెండర్లకు సిద్ధమైన దరిమిలా.., కొత్త పంచాయతీ మెట్రో, టీజీఐఐసీ రూపంలో కొత్త పంచాయతీ వచ్చి పడింది. ఈ మూడు శాఖల మధ్య సమన్వయం లోపం కారణంగా హెచ్ సిటీ ప్రాజెక్టు టెండర్లలో మరింత ఆలస్యం కావడమే కాదు, టీజీఐఐసీ డిమాండ్ మేరకు ఒక చోట నుంచి జీహెచ్ఎంసీ తప్పుకోవడం ఇంజనీర్లలో ఇప్పుడు మరింత చర్చనీయాంశంగా మారింది. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించబోయే ఫ్లై ఓవర్ల మార్గాల్లో మెట్రో రైలు వచ్చే ప్రాంతాల్లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణాలు జరపాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఖాజాగూడ జంక్షన్, ఐఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల పనులకు రూ.837 కోట్ల పరిపాలన అనుమతులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డిజైన్లను ఖరారు చేసి టెండర్లను సిద్ధం చేసింది. రూ.158 కోట్లతో 1.05 కిలో మీటర్ల మేరలో విప్రో సర్కిల్ దగ్గర రెండు మార్గాల్లో నాలుగు లేన్ల ఫ్లై ఓవర్లు నిర్మించనున్నారు. విప్రో గేట్ దగ్గర నుంచి ప్రారంభమయ్యే ఈ ఫ్లై ఓవర్ ఎస్సెంచర్‌కు ముందుగా దిగనుంది. ఇదే మార్గంలో మెట్రో రైల్ రెండో దశలో భాగంగా రాయదుర్గం నుంచి కోకాపేట నియో పోలీస్ వెళ్లే మార్గం రానుంది. అందుకు అనుగుణంగా ఫ్లై ఓవర్, పై నుంచి మెట్రో వెళ్లేలా జీహెచ్ఎంసీ ప్లాన్ చేసింది. ఐతే, మెట్రో నిర్మాణం మెట్రో, ఫ్లై ఓవర్ వంతెన మాత్రం జీహెచ్ఎంసీ చేపట్టాల్సి ఉంది. కానీ, ఇక్కడే టీజీఐఐసీ మా పరిధిలో ఉంది.. కాబట్టి మేం ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చేపడతామంటూ జీహెచ్ఎంసీకి అడ్డు తగిలింది. మెట్రో భవన్‌లో ఈ మూడు శాఖల మధ్య సమావేశంలో టీజీఐఐసీ శుక్రవారం తేల్చి చెప్పింది. దీంతో జీహెచ్ఎంసీ వెనక్కి తగ్గి విప్రో సర్కిల్ వంతెన పనుల నుంచి తప్పుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఐతే, డిజైన్లతో సిద్ధంగా ఉన్న ఈ ప్రాజెక్టు పనులను ఇప్పుడు అడ్డుకోవడం ఏమిటని టీజీఐఐసీ తీరు పట్ల జీహెచ్ఎంసీలో కొందరు ఇంజనీర్లు తీవ్రంగా మండిపడుతున్నారు. మొత్తంగా శాఖల మధ్య సమన్వయంతో హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రూ.220 కోట్లతో 1.52 కిలో మీటర్ల మేరలో ఖాజాగూడ చౌరస్తాలో పై వంతెన, అండర్ పాస్, రూ.459 కోట్లతో 3.25 కోట్లతో ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో మూడు వంతెనలు, అండర్ పాస్ పనులకు టెండర్లను పిలిచేందుకు జీహెచ్ఎంసీ సిద్ధం అవుతున్నట్లు ఇంజనీర్లు తెలిపారు.